ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

మంగళవారం 30 జనవరి 2024



ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి

- బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లో చాన్స్ ఇవ్వకుండా ఎత్తుగడలు
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలు ఎమ్మెల్యేలకు
- మంత్రులు కొండా, పొంగులేటికి వరంగల్, మహబూబాబాద్ స్థానాల బాధ్యతలు
- ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేక దృష్టిపెట్టిన కాంగ్రెస్ అధిష్ఠానం

బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ కసరత్తు



వరంగల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్‌కు సిద్ధమవుతోంది. బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్ పావులు కదుపుతోంది. నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నికలతో పాటు పార్లమెంట్ ఎన్నికలపై దృష్టిపెట్టింది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలకు ఏ ఎన్నికల్లో గెలిచే అవకాశం ఇవ్వకూడదని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. పార్లమెంట్ స్థానాలకు మంత్రులను ఇంచార్జులుగా నియమించడంతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులైన ఓటర్లను చేర్పించే బాధ్యతలను ఎమ్మెల్యేలకు, కీలక నేతలకు అప్పగించింది. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో విజయంపై సమీక్షలు నిర్వహిస్తు పార్టీ పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. దీంతో ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ భారీ కసరత్తు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

ఎంపీ సీట్లపైనే హస్తం ఫోకస్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు ఉండగా, కనీసం 12 స్థానాలైన గెలువాలని ఏఐసీసీ నుంచి ఆదేశాలు ఉన్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానాలైన వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకునేందుకు కాంగ్రెస్ తీవ్రంగా కసరత్తు చేస్తుంది. ఇప్పటికే వరంగల్ పార్లమెంట్ ఇంచార్జీగా మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ పార్లమెంట్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలను కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. ఇటీవల స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంట్ ఎన్నికలపై హైదరాబాద్‌లో సమీక్ష కూడా నిర్వహించారు. రెండు ఎంపీ స్థానాలను గెలుచుకునేలా వ్యూహాలు రూపొందించాలని మంత్రులకు సీఎం సూచించారు.

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కేవలం స్టేషన్‌ఘన్‌పూర్‌లోనే బీఆర్ఎస్ విజయం సాధించింది. మిగతా ఆరు స్థానాలు కాంగ్రెస్ ఖాతాలోనే ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 6,63,556 ఓట్లు పొందగా, బీఆర్ఎస్‌కు 4,33,368 ఓట్లు, బీజేపీకి 1,56,638 ఓట్లు పోలయ్యాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు 2,41,987 ఓట్ల ఆధిక్యం లభించింది. దీంతో ఈసారి వరంగల్ ఎంపీ సెగ్మెంట్‌లో పాగా వేయడం పెద్ద కష్టం కాదనే ధీమాలో కాంగ్రెస్ పార్టీ ఉంది.

అలాగే మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. ఇక్కడ కూడా కాంగ్రెస్ పార్టీకి 6,85,897 ఓట్లను పొందగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు పోలయ్యాయి. ఇక బీజేపీకి కేవలం 34,431 ఓట్లు మాత్రమే లభించాయి. ఈ ఎంపీ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 2,30,188 ఓట్ల ఆధిక్యత లభించింది. దీంతో ఈ రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో కాంగ్రెస్‌కు భారీగా ఓటు బ్యాంకు పెరగడంతో ఎంపీ ఎన్నికల్లో గెలుపై ధీమాగా ఉంది. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్‌తో ముఖాముఖి పోటీ ఉండే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది.

అయితే వరంగల్ పార్లమెంట్ పరిధిలోని పరకాల, వరంగల్‌తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాల్లో బీజేపీ కొంత ప్రభావం చూపించింది. దీంతో వరంగల్ ఎంపీ స్థానంలో త్రిముఖ పోటీ జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ భావిస్తుంది. దీంతో బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు ప్రయత్నిస్తుంది. అయితే పొత్తులో భాగంగా వరంగల్ సీటును సీపీఐ కూడా అడుగుతుంది. అయితే దీనిపై ఎలాంటి స్పష్టత లేకున్నప్పటికీ రెండు ఎంపీ సీట్లను మాత్రం పక్కాగా గెలుచుకోవాలని కాంగ్రెస్ కసరత్తు చేస్తుంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై...

జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిసెంబరు 9న ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ఆరు నెలల్లోగా ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండటంతో జూన్ 8వ తేదీ వరకు ఉప ఎన్నికకు గడువుంది. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో ఏప్రిల్ నెల లేదంటే జూన్ మొదటి వారంలోనే ఎమ్మెల్సీ పదవికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. కాగా, నల్లొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో ఖచ్చితంగా గెలువాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకుంది. శాసనమండలిలో కాంగ్రెస్‌కు మెజార్టీ లేకపోవటంతో ప్రతి ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీకి సవాల్‌గా మారింది. దీంతో నల్లొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది.

2007లో ఈ నియోజకవర్గం ఏర్పడగా, అప్పటి నుంచి జరిగిన మూడు ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థులే విజయం సాధించారు. 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాములునాయక్

▸▸ మిగతా 7వ పేజీలో..

అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల వారీగా పోలైన ఓట్లు

నియోజకవర్గం	అసెంబ్లీ నియోజకవర్గాలు	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	07	6,63,556	4,33,368	1,56,638
మహబూబాబాద్	07	6,85,897	4,43,910	34,431

కాంగ్రెస్‌కు తొలి సవాల్...

గత ఏడాది డిసెంబరు 7వ తేదీన కొలువుదీరిన కాంగ్రెస్ పార్టీ తొలి సవాల్ ఎదుర్కొనుంది. ఇటీవల సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల్లో తన మిత్రపక్షం సీపీఐతో కలిసి కాంగ్రెస్ క్లీన్‌స్వీప్ చేసింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ అనుబంధ సంఘాలు జాడ లేకుండా పోయాయి. అయితే ఇది ఒక వర్గానికి సంబంధించిన ఎన్నికలే కావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పటికే రెండు హామీలను అమలు చేస్తున్న ప్రభుత్వం ఫిబ్రవరిలో మరో హామీని కూడా అమలు చేసేందుకు కసరత్తు పూర్తి చేసింది. మార్చి, ఏప్రిల్ నాటికి మిగతా రెండు హామీలను కూడా అమలు చేసి పార్లమెంట్ ఎన్నికలకు వెళ్లాలనే యోచనలో కాంగ్రెస్ ఉంది. పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపుతో పాటు ఉమ్మడి వరంగల్‌లోని రెండు పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలు ఇచ్చే తీర్పు ఇదే కావటంతో ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారాయి.



మహబూబాబాద్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఈవీఎంలపై అవగాహన కల్పించాలి

▸▸ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఓటర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం)లపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్‌లోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటు వేసి అవగాహన పొందాలన్నారు. అఖిలపక్ష పార్టీల ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఓటింగ్ యంత్రాలపై ఓటు వేసి అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సవ్ టొప్పొ, ఎం.డేవిడ్, కలెక్టరేట్ ఏవో వెంకటరమణ, ఎన్నికల విభాగం తహసీల్దార్లు పవన్‌కుమార్, మాధవి పాల్గొన్నారు.



సీతానగరం శివారులోని భీమునిపాదం జలపాతాన్ని సందర్శించిన డీఎఫ్‌వో రవికిరణ్-అర్చన దంపతులు

భీమునిపాదం జలపాతంను సందర్శించిన డీఎఫ్‌వోలు

గూడూరు, జనవరి 29 : గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీ ప్రాంతంలో ఉన్న భీమునిపాదం జలపాతాన్ని మహబూబాబాద్ డీఎఫ్‌వో రవికిరణ్, వరంగల్ డీఎఫ్‌వో అర్చన దంపతులు సోమవారం సందర్శించారు. జలపాతంలో జాలువారుతున్న వాటర్ ఫాల్స్‌ను వీక్షించారు. అటవీ ప్రాంతంలో పర్యటించారు. భీమునిపాదం అభివృద్ధిపై అధికారులను వివరాలుతెలుసుకున్నారు. అభివృద్ధిపై ఇరువురు డీఎఫ్‌వోలు సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఎఫ్‌డీవో చంద్రశేఖర్, ఎఫ్ఆర్వోసురేష్, డీఆర్వోశ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బలరాంనాయక్

మానుకోట నుంచి పోటీ చేస్తా..

▸▸ కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్

ములుగు, జనవరి 29: మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తానే పోటీలో ఉంటానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు ఈ మేరకు హామీ ఇచ్చారని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ అన్నారు. ములుగు జిల్లాలో ఆయన సోమవారం పర్యటించారు. ములుగులో కాంగ్రెస్ ముఖ్య నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం సీఎంతో భేటీ అయ్యానని, గెలుపే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో పనిచేసుకోవాలని సూచించారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని అన్నారు. ఆరు గ్యారెంటీ పథకాల్లో ఇప్పటికే రెండు విజయవంతంగా అమలవుతున్నాయని అన్నారు. మిగిలిన నాలుగు కూడా త్వరలోనే ప్రజలకు చేరువవుతాయని తెలిపారు. కాంగ్రెస్ అంటేనే ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే పార్టీ అన్నారు. అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నాయకులు అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని బలరాంనాయక్ విమర్శించారు. ఈ సమావేశంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వంగ రవియాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భైరెడ్డి భగవాన్‌రెడ్డి, ములుగు పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపడుతున్న విశ్వనాథ్

తొర్రూరు ఆర్టీసీ డీఎంగా విశ్వనాథ్

తొర్రూరు, జనవరి 29 : తొర్రూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బి.విశ్వనాథ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిలాబాద్ డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథ్ పదోన్నతి ద్వారా బదిలీపై వచ్చి తొర్రూరు డిపో మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన కె.పరిమళ సొంత పనుల నిమిత్తం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డిపో మేనేజర్ విశ్వనాథ్‌కు ఆర్టీసీ యూనియన్ నాయకులు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రజితారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. డిపో అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని డీఎం తెలిపారు.

ఓటరు జాబితాకు ఇంటింటి సర్వే చేపట్టాలి

▸▸ ఓటరు జాబితా పరిశీలకులు బాల మాయాదేవి



మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకులు బాల మాయాదేవి

మహబూబాబాద్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పటిష్ఠమైన ఓటరు జాబితా రూపొందించేందుకు ఇంటింటి సర్వే చేపట్టాలని ఓటరు జాబితా జిల్లా పరిశీలకులు బాల మాయాదేవి అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మహబూబాబాద్, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ వివరిస్తూ... జిల్లాలోని పూర్తి స్థాయి మానుకోట, డోర్నకల్ నియోజకవర్గాల్లో 539 పోలింగ్ కేంద్రాలున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల పరిధిలో ఓటర్ల జాబితా రూపకల్పనకు ఈ నెల 21, 22 తేదీల్లో బీఎల్‌వోలతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. 1 జనవరి 2024 వరకు 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. స్థానికంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, ఆన్‌లైన్ ద్వారా బీఎల్‌వోలు ఓటర్లకు అవగాహన కల్పించి దరఖాస్తులను యాప్ ద్వారా స్వీకరించడం జరుగుతుందన్నారు. డబుల్ ఓటర్లు, వలస ఓటర్లను పరిశీలించి తొలగింపుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

ఓటరు జాబితా జిల్లా పరిశీలకులు బాల మాయాదేవి మాట్లాడుతూ... పటిష్ఠమైన ఓటరు నమోదుకు ఇంటింటి సర్వే అవసరమన్నారు. ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు నమోదుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా యాప్‌లో నమోదు, పెండింగ్ లిస్టులను పరిశీలిస్తూ.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్వీప్ కార్యక్రమాలను మరింత విస్తరింప చేయాలని, బస్టాండ్‌ల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల విద్యార్థులతో గుర్తించిన అంబాసిడర్స్‌తో ఓటు హక్కు విశిష్టతను తెలియజేయాలని సూచించారు. సాధ్యమైనంత వేగంగా పెండింగ్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపట్టాలన్నారు. మృతుల ఓటర్ల తొలగింపులో డెత్ సర్టిఫికెట్ల పరిశీలన చేస్తూ కుటుంబ సభ్యులతో వాంగ్మూలం తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సవ్ టొప్పొ, ఎం.డేవిడ్, స్వీప్ నోడల్ అధికారి సన్యాసయ్య, మానుకోట, డోర్నకల్ ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, తహసీల్దార్లు భగవాన్‌రెడ్డి, సునిల్‌రెడ్డి, నరేష్, ఎన్నికల విభాగం అధికారులు పవన్, రంజిత్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై సమావేశాలు నిర్వహించాలి

▸▸ జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 29: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఫిబ్రవరి 24 వరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ విద్యా విభాగం. విద్యాశాఖ సహాయంతో ఉన్నత పాఠశాలల్లోని 8, 9 తరగతుల విద్యార్థులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సమ్మక్క, సారలమ్మ జాతర సందర్భంగా విద్యార్థులచే జిల్లాలోని మోడల్ స్కూల్స్, కేజీబీవీ, జడ్పీ హైస్కూల్స్ ప్రిన్సిపాల్స్, ప్రత్యేకాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో మోడల్ జిల్లా పరిషత్ పర్యావరణ పరిరక్షణ సమావేశాలను 90 నిమిషాల పాటు నిర్వహించి కార్యక్రమాల రిపోర్టును వాట్సాప్ గ్రూపులో సమర్పించాలన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఫిబ్రవరి 28న జిల్లా స్థాయిలో అవార్డులు అందజేయనున్నట్లు డీఈవో పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఎన్‌జీసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.గురునాథరావు (9866549297), జిల్లా సైన్స్ అధికారి బి.అప్పారావు (9849598281)లను సంప్రదించాలన్నారు.

ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన

- ▸▸ నలుగురు డైరెక్టర్లకు ఉద్వాసన
- ▸▸ జారీ అయిన ఉత్తర్వులు
- ▸▸ నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనందుకే..
- ▸▸ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం
- ▸▸ కొత్త వారికి త్వరలో నోటిఫికేషన్

7

మేడారంలో భక్తుల సందడి

▸▸ ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్న 20వేల మంది



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 29 : తాడ్వాయి మండలం మేడారంలో భక్తుల సందడి నెలకొంది. వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు సోమవారం భారీ సంఖ్యలో తరలివచ్చి మహాజాతరకు ముందుగానే వనదేవతలను దర్శించుకున్నారు. సుమారు 20వేల మంది సమ్మక్క, సారలమ్మల సన్నిధిలో మొక్కులు చెల్లించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు.

మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. వనదేవతల గద్దెలకు చేరుకొని అమ్మవార్లకు పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం)తో మొక్కులు తీర్చుకున్నారు.

ప్రసాదం లేకుండానే...

మహా జాతరకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులకు ప్రసాదం దక్కడం లేదు. దూర ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చి తల్లులను దర్శించుకుంటున్న తమకు నిరాశే ఎదురవుతోందని భక్తులు అంటున్నారు. వనదేవతలకు గద్దెల వద్ద బంగారం (బెల్లం) సమర్పించిన అనంతరం దానిని ప్రసాదంగా అందించాల్సి ఉండగా పూజారులు తమకు ఇవ్వడం లేదని అంటున్నారు. భక్తిశ్రద్ధలతో తల్లులకు పూజలు చేసిన అనంతరం ప్రసాదం లేకుండానే తిరిగి వెళ్తున్నామని తెలిపారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం : మహాజాతరకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఐటీడీఏ పీవో అంకిత్‌తో కలిసి ఆమె సోమవారం మేడారంలో పర్యటించారు. గద్దెల పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఇంకొన్ని రోజుల్లోనే మహాజాతర జరగనుందని, పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఆమె వెంట ఐటీడీఏ ఏపీవో వసంతరావు, డీపీవో వెంకయ్య, ఐటీడీఏ ఎస్‌వో రాజ్‌కుమార్, తాడ్వాయి తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.

గడ్డం సమ్మయ్యకు ఘన సన్మానం

దేవరుప్పుల, జనవరి 29 : దేవరుప్పుల మండలంలోని అప్పిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన చిందుయక్షగాన కళాకారుడు, కళారత్న, హంస, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సోమవారం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో సమ్మయ్యను అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన సమ్మయ్య మన తెలంగాణ వ్యక్తి కావటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అదే విధంగా రాష్ట్రానికి ఎంతో పేరు తెచ్చి పెట్టారన్నారు. సమ్మయ్యతో పాటు కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. అదే విధంగా సినీ నటుడు చిరంజీవి పద్మశ్రీ పొందిన సమ్మయ్యను బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ పద్మశ్రీకి ఎంపికైన సమ్మయ్య కళలకు ఆజ్యం పోశారన్నారు. కార్యక్రమంలో సమ్మయ్య కుమారులు సోమరాజు, హిమగిరి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



వడ్డెకొత్తపల్లిలో నూతన జీపీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

▸▸ పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

పెద్దవంగర, జనవరి 29 : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి తెలిపారు. మండలంలోని వడ్డెకొత్తపల్లిలో సోమవారం సర్పంచ్ ఎన్.ప్రవీణ్‌రావుతో కలిసి నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలేనని, గ్రామాలను అభివృద్ధి చేసుకునే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలు అర్హులైన లబ్ధిదారులకు అందేవిధంగా చూడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఆడపిల్లల జీవితాలకు భరోసా కల్పించేందుకు వారి వివాహాల కోసం రూ.1లక్ష 116లతో పాటు త్వరలో తులం బంగారాన్ని అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్చిస్తున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరస్తున్నారన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, అప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ దయాకర్, ఎంపీటీసీ ఝాన్సీ, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నెహ్రూనాయక్, సోమయ్య, రంగు మురళి, దుంపల శ్యామ్, వెంకన్న, రవి, ఉపేందర్, సీతారామ్ నాయక్, దాసరి శ్రీనివాస్, సైదులు, తన్నీరు వేణు, యాకన్న, స్వామి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అన్నారం ఉర్సు


దర్గాలో పూజలు చేస్తున్న ముజావర్లు

పర్వతగిరి, జనవరి 29: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని అన్నారం షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు చివరి రోజైన సోమవారం ముగిసాయి. మూడు రోజులుగా నిర్వహించిన వేడుకల్లో చివరి రోజు ఖత్‌మల్ ఖురానా (ఖురాన్ పఠనం)తో ముగిసాయి. ఉర్సు ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా 70 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్సై వీరభద్రరావు తెలిపారు.

పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలి

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు స్కాలర్స్ వినతి


మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న కుర్సా అధ్యక్షుడు ఉషన్‌నాయక్, ప్రశాంత్

కేయూ క్యాంపస్, జనవరి 29 : రాష్ట్ర ప్రభుత్వం వర్సిటీల్లో పరిశోధన చేస్తున్న పీహెచ్‌డీ విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇప్పించాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిసి కేయూ పరిశోధకుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉషన్‌నాయక్, కళ్లెపల్లి ప్రశాంత్‌ల నేతృత్వంలో సోమవారం వినతి పత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఉషన్‌నాయక్, ప్రశాంత్‌లు మాట్లాడుతూ..వర్సిటీల పరిశోధన విద్యార్థులకు ఫెల్లోషిప్ ఇవ్వాలన్నారు. పరిశోధనల్లో నాణ్యతకు ఫెల్లోషిప్‌లు దోహదపడుతాయని అన్నారు. ఒడిస్సా, యూపీ రాష్ట్ర ప్రభుత్వాలు సీఎం రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ పథకం క్రింద ఫెల్లోషిప్‌లు ఇస్తున్నాయని తెలిపారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సీఎం దృష్టికి విషయాన్ని తీసుకెళ్ళి త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కుర్సా నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కుర్సా జనరల్ సెక్రటరీ కళ్లెపల్లి ప్రశాంత్, వైస్ ప్రెసిడెంట్ జానకి రామ్, కోశాధికారి అంగడి సతీశ్, ఈసీ మెంబర్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య


మాట్లాడుతున్న చుక్కయ్య

ఐనవోలు, జనవరి 29: హనుమకొండ ఫాతిమానగర్‌లో నిర్వహించనున్న సీఐటీయూ జాతీయ సమావేశాలను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. చుక్కయ్య, సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్యలు పిలుపునిచ్చారు. సోమవారం ఐనవోలులో జరిగిన ప్రజాసంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ సీఐటీయూ జాతీయ సమావేశాలు ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీలలో ఫాతిమానగర్ బాలవికాస్‌లో జరుగుతాయని తెలిపారు.

ఈ సమావేశాల్లో కేంద్రంలో బీజేపీ అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేస్తారన్నారు. 31న బహిరంగ సభ ఉంటుందని వేయిస్తంభాల ఆలయం నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు భారీ కార్మిక ర్యాలీ జరుగుతుందన్నారు. ఈసమావేశాల్లో బీవీ రాఘవులు, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, తపన్‌సేన, ప్రముఖులు హజరుకానున్నట్లు తెలిపారు. బహిరంగసభకు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు కేఎస్ రెడ్డి, ఉప్పలయ్య, నాగరాజు, కుసుంబ దేవేందర్, నర్సయ్య, కొమురయ్య, మేకిరి మోహన్‌రావు తదతరులు పాల్గొన్నారు.

మరణ సందేశం పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేయూ వీసీ ఆచార్య రమేశ్

వడ్డెపల్లి, జనవరి 29: సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ రాసిన మరణ సందేశం పుస్తకాన్ని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య తాటికొండ రమేశ్ సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సభలో ఆవిష్కరించారు. తొలుత జర్నలిస్టు గౌరీ లంకేష్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రమేశ్ మాట్లాడుతూ మరణ సందేశం పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకమన్నారు.

ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, అంతడుపుల శ్రీనివాస్, బండి మొగిలి, ప్రజాసంఘాల నాయకులు నల్లెల్ల రాజయ్య, రమేశ్‌రాజా, కోగిల చంద్రమౌళి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలపై గురి

5వ పేజీ తరువాయి

నామమాత్రపు పోటీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన తీన్మార్ మల్లన్న, కోదండరాంలు ప్రస్తుతం కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండడంతో ఈసారి ఎమ్మెల్సీ ఉప ఎన్నికను కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీంతో ఈసారి భారీ ఎత్తున గ్రాడ్యుయేట్స్ ఓట్లను నమోదు చేయాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసింది. తన నియోజకవర్గ పరిధిలో సాధ్యమైనంత వరకు ఎక్కువ సంఖ్యలో గ్రాడ్యుయేట్ ఓట్లను నమోదు చేయాలని ఎమ్మెల్యేకు పార్టీ టాస్క్ ఇచ్చింది. పది రోజులుగా పట్టభద్రుల ఓట్ల కోసం ఎమ్మెల్యేలు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు.. బీఆర్‌ఎస్ సిట్టింగ్ స్థానాలైన ఎంపీ, ఎమ్మెల్సీ స్థానం దక్కించుకోవటంపై కాంగ్రెస్ దృష్టి పెట్టింది.



టీఎస్‌ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన

నలుగురు డైరెక్టర్లకు ఉద్వాసన

- జారీ అయిన ఉత్తర్వులు
- నిబంధనలకు విరుద్ధంగా నియామితులైనందుకే..
- ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్న ప్రభుత్వం
- కొత్త డైరెక్టర్ల నియామకానికి త్వరలో నోటిఫికేషన్

హనుమకొండ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ ఎన్‌పీడీసీఎల్) ఎట్టకేలకు ప్రక్షాళన మొదలైంది. గత పదేళ్లుగా పాతుకు పోయిన నలుగురు డైరెక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్వాసన పలికింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ఏఎం రిజ్వీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌పీడీసీఎల్‌తో పాటు టీఎస్ఎస్పీడీసీ ఎల్‌లోని ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగించారు. దీంతో ఒక్క కలంపోటుతో మొత్తం పదకొండు మంది డైరెక్టర్లు ఇంటిదారి పట్టారు. విద్యుత్ పంపిణీ సంస్థలను ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించినట్టుగా ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. ఇక వీటికి మంచి రోజులు వచ్చినట్టేనని విద్యుత్ వినియోగదారులు, వాటిలో పని చేస్తున్న ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 'ఎన్‌పీడీసీఎల్‌లో ప్రక్షాళన షురూ' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ఈనెల 16న ప్రత్యేకం కథనం వచ్చింది. చెప్పినట్టుగానే డైరెక్టర్ల తొలగింపు జరిగింది.

వేటు పడిన డైరెక్టర్లు

టీఎస్ఎన్‌పీడీసీఎల్‌లో వేటు పడిన డైరెక్టర్లలో బి.వెంకటేశ్వర్ రావు (హెచ్ఆర్), పి.మోహన్‌రెడ్డి (ప్రాజెక్టులు), పి.సంధ్యారాణి (కమర్షియల్), పి గణపతి (ఐపీసీ అండ్ ఆర్‌ఏసీ) ఉన్నారు. బి.వెంకటేశ్వర్ రావు మినహా మిగతా ముగ్గురు డైరెక్టర్ల నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నలుగురు నిబంధనలకు వ్యతిరేకంగా చాలా సంవత్సరాలుగా పని చేస్తున్నందు వల్లనే వారిని తొలగించినట్టు పేర్కొన్నారు. బి.వెంకటేశ్వర్ రావు (డైరెక్టర్ హెచ్ఆర్) 2013 జులై 31న నియమితులయ్యారు. 10 సంవత్సరాల 5 నెలల పాటు కొనసాగారు. వెంకటేశ్వర్ రావు 2007లో సీఈగా రిటైర్ అయ్యారు. ఆ తర్వాత అయిదేళ్లకు డైరెక్టర్ అయి అప్పటి నుంచి కొనసాగుతూ వస్తున్నారు. పి.మోహన్‌రెడ్డి (డైరెక్టర్ -పాజెక్టులు) 2018 సెప్టెంబరు 5 తేదీన నియమితులయ్యారు. 5 సంవత్సరాల 4 నెలలుగా ఆయన కొనసాగుతు న్నారు. ఈయన 2006లో సీఈగా రిటైర్ అయ్యారు. మోహన్‌రెడ్డికి 2009లో ఒక సారి, 2011లో రెండో సారి, 2018లో ముచ్చ టగా మూడో సారి ఎక్స్‌టెన్షన్ ఇచ్చారు.పి.సంధ్యారాణి (డైరెక్టర్-కమర్షియల్) 2018 సెప్టెం బరు 5న నియమితులయ్యారు. ఆమె కూడా 5 సంవత్సరాల 4 నెలలుగా కొనసా గుతున్నారు. ఈమే 2021లో సీఈగా రిటైర్ అయ్యారు. అయితే 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగి హోదా లో డైరెక్టర్ గా కొనసాగుతూ వచ్చారు. అలాగే పి.గణపతి (డైరెక్టర్- ఐపీసీ అండ్ ఆర్‌ఏసీ) కూడా 2018 సెప్టెంబరు 5న నిమితులై గత 5 ఏళ్ల 4 నాలుగు నెలలుగా కొనసాగుతు న్నారు. ఈయన 2014 ఆగస్టులో రిటైర్ కావలసి ఉన్నది. 2018 నుంచి ఇన్‌సర్వీస్ ఉద్యోగిగా డైరెక్టర్ హోదాలో కొనసాగుతూ వచ్చారు.



గత సీఎండీ గోపాల్‌రావుతో ప్రస్తుతం తొలగింప బడిన డైరెక్టర్లు

నాలుగేళ్లు మించకూడదు

సాధారణంగా ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్లుగా విద్యుత్ సంస్థల్లో సీఈ హోదాలో రిటైర్ అయిన వారిని లేదా ఇంకా రెండేళ్లలో రిటైర్ కానున్న ఇన్‌సర్వీస్ ఉద్యో గులను డైరెక్టర్లుగా నియమిస్తారు. డైరెక్టర్లను తొలుత రెండేళ్ల కాలపరిమితితో మాత్రమే నియమించాలి. ఆ తర్వాత అవసరాన్ని బట్టి వారి కాలపరిమితిని మరో ఏడాది పొడిగించవచ్చు. గరిష్ఠంగా రెండు సార్లు మాత్రమే వారికి ఎక్స్‌టెన్షన్ ఇవ్వాలి. ఏ డైరెక్టర్ అయిన నాలుగేళ్లకు మించి పని చేయరాదు. కానీ ఎన్‌పీడీసీఎల్‌లో ఇందుకు విరు ద్ధంగా డైరెక్టర్లకు ఇష్టారీతిన పొడిగింపులు ఇస్తూ వెళ్లారు. వెంకటేశ్వర్‌రావు (డైరెక్టర్-హెచ్ఆర్‌ఏ) గత పదేళ్లుగా కొనసాగుతున్నారు. ఆయన పదవీ కాలంలో నలుగురు సీఎండీలు మారారు. ఎన్‌పీడీసీఎల్‌లో మొత్తం అయిదుగురు డైరెక్టర్లలో ఈ నలుగురు పోను మరో డైరెక్టర్ (ఫైనాన్స్)గా ప్రస్తుతం చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం ఎకౌంట్స్)గా పని చేస్తున్న తిరుపతి రెడ్డి కొనసాగుతున్నారు. అయితే ఆయన ఇన్‌చార్జి డైరెక్టర్ మాత్రమే. అంతకు ముందు పని చేసిన డైరెక్టర్ పదవీ కాలం ముగియడంతో ఆయన బాధ్యతలను తిరుపతి రెడ్డికి అప్పగించారు.

టీఎస్ఎస్పీడీసీఎల్

తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్పీడీసీఎల్)లోనూ ప్రస్తుతం సుదీర్ఘ కాలం పాటు కొనసాగుతున్న మరో ఏడుగురు డైరెక్టర్లను కూడా తొలగిస్తూ రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. జె.శ్రీనివాసరెడ్డి (డైరెక్టర్-ఆపరేషన్స్), టి.శ్రీనివాస్ (డైరెక్టర్-ప్రాజెక్టులు), కె రాములు (డైరెక్టర్ కమర్షియల్, డీపీఈ, అసెస్‌మెంట్ అండ్ ఎనర్జీ ఆడిట్), జి.పర్వతం (డైరెక్టర్-హెచ్ఆర్ అండ్ ఐఆర్) సీహెచ్ మదన్ మోహన్ (డైరెక్టర్ పీఅండ్ఎంఎం) ఎస్.స్వామిరెడ్డి (డైరెక్టర్-ఐపీసీ అండ్ ఆర్‌పీసీ), గంపా గోపాల్ (డైరెక్టర్,ఈ ఆడిట్, డీపీఈ అండ్ అసెస్‌మెంట్) వీరిలో ఉన్నారు. వీరిలో జె.శ్రీనివాస్ రెడ్డి 9 సంవత్సరాలు 2 నెలలుగా, టి శ్రీనివాస్ 10 సంవత్సరాల 5 నెలలుగా కొనసాగుతున్నారు. మిగతా వారంతా 5 సంవత్సరాల 5 నెలలుగా పని చేస్తున్నారు. కొత్త డైరెక్టర్ల నియామకం త్వరలో జరగవచ్చునని తెలుస్తోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

మహాజాతరను విజయవంతం చేద్దాం..

- అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలి
- ఐటీడీఏ పీవో అంకిత్

మేడారం, జనవరి 29 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే మహాజాతరను విజయవంతం చేసేందుకు అధికారులు, పూజారులు సమన్వయంగా పనిచేయాలని ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. దేవాదాయ శాఖ ఈవో రాజేందర్ ఆధ్వర్యంలో మేడారంలో ఈ సమావేశం జరిగింది. మహాజాతరను విజయవంతం చేయడా నికి చేపడుతున్న కార్యాచరణపై ఈ సందర్భంగా చర్చించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూజారులు, అధికారులు సమన్వయంగా జాతరను విజయవంతం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అంకిత్

పూజా కార్యక్రమాలు, వాటికి చేపట్టాల్సిన ఏర్పాట్లను పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావును అడిగి తెలుసుకున్నారు. కొండాయి నుంచి గోవిందరాజులు, పొనుగొండ్ల నుంచి లక్ష్మీపురం మీదుగా పగిడిద్దరాజును తీసుకొచ్చే సమయంలో పోలీసు రోప్ పార్టీల ద్వారా భద్రత కల్పించేందుకు డీఎస్పీ స్థాయి అధికారితో సమన్వయం చేసుకోవాలన్నారు. చిలుకలగుట్ట నుంచి సమ్మక్క, కన్నెపల్లి నుంచి సారలమ్మ అమ్మవార్లను తీసుకొచ్చే సమయంలో మూడంచల భద్రత అవసరం ఉంటుందన్నారు. వనదేవతల పూజారులకు ఎండోమెంట్ ద్వారా శాశ్వత గదులు కేటాయించాలన్నారు. దేవస్థానం కోసం కేటయించిన స్థలంలో శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించాలన్నారు. పూజారులకు వసతి, సౌకర్యాలు కల్పిస్తామని, వారి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో వసంతరావు, ఎస్వో రాజ్‌కుమార్, పూజారులు వెంకటేశ్వరు, గోవర్ధన్, ప్రభకర్, నర్సింగరావు, భోజరావు, రమేష్, రాజేశ్వర్, పూర్ణచందర్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శాఖ సన్నద్ధం : ఎస్పీ శబరీశ్



ములుగు, జనవరి 29: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను విజయవం తంగా జరిపించేందుకు పోలీసు శాఖ సన్నద్ధమ వుతోందని ములుగు ఎస్పీ శబరీశ్ తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు చేపడతామని అన్నారు. ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. కుంభమేళా స్థాయిలో జరిగే మేడారం జాతర నిర్వహణ బాధ్యత పోలీసు శాఖ ద్వారా తనకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపడతామ న్నారు. గత జాతర సమయంలో తలెత్తిన సమస్యలు పునరావృతం కాకుండా చూసుకుంటామని అన్నారు. ప్రధానంగా ట్రాఫిక్, భక్తులు, వీఐపీల రక్షణపై దృష్టి సారించామని తెలిపారు. సాధ్యమైనంత తవరకు పార్కింగ్ స్థలాలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. జాతర నిర్వహణలో ప్రజలు పోలీసు శాఖకు సహకారం అందించాలని ఆయన కోరారు.



దరఖాస్తు ఫారాలను అందజేస్తున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఓటరు నమోదును వేగవంతం చేయాలి

వరంగల్ సిటీ, జనవరి 29: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటరు దరఖాస్తు ఫారాలను ఆయన పట్టభద్రులకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ... త్వరలో జరుగనున్న ఖమ్మం, నల్లగొండ వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల్లోని పట్టభద్రులందరు ఓటు నమోదు ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులకు దరఖాస్తు ఫారాలను అందజేశారు. పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా నాయకులు తిరుపతిరెడ్డి, శ్రీహరి, రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, ఉపేందర్‌రెడ్డి, రాజు, అశోక్‌రావు, రాజు, చంద్రమోహన్, రమేష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, విష్ణుమూర్తి, రాజేందంర్‌రెడ్డి, సోమేశ్వరశర్మ, శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్‌రావు, రఘుపతి పాల్గొన్నారు.

యాసంగి వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నారాయణగిరిలోని పంట పొలాల్లో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

వరంగల్ సిటీ, జనవరి 29: ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగుచేస్తున్న యాసంగి వరిలో కాండం తొలుచు పురుగులు, రెక్కల పురుగుల ఉధృతి పెరుగుతుండటంతో రైతులు తీసుకోవాల్సిన పలు సస్యరక్షణ చర్యలను వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.దిలీప్‌కుమార్, యు. నాగభూషణం, ఎం.విశ్వతేజ క్షేత్రస్థాయిలో రైతులకు వివరించారు. సోమవారం ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి వరి పొలాలు, నారుమళ్లలో క్షేత్రస్థాయి పర్యటనలు చేసి రైతులకు సలహాలు, సూచనాలు అందజేశారు. పురుగుల ఉధృతిని గమనిం చడానికి దీపపు ఎర, సోలార్ ఎర, లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసి నిఘా పెట్టాలన్నారు. వరి పిలక దశలో ఎకరాకు మూడు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసి అందులో వారానికి బుట్టలో 25-30 పురుగులు పడినప్పుడు పంటకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

నేడు కేయూలో ప్రాంగణ నియామకాలకు ఇంటర్వ్యూలు

కేయూ క్యాంపస్, జనవరి 29: కేయూ కెమిస్ట్రీ విభాగంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు హైదరాబాద్‌లోని లురస్ ల్యాబ్ రిసెర్చ్ అనలిస్టులుగా పనిచేసేందుకు ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ, ఎంఫార్మసీ క్వాలిటీ అనలటిక్స్/ఫార్మా అనలటిక్స్ పూర్తి చేసిన వారు ప్రసుత్తం చదువుతున్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో పనిచేయాలని, ఏడాదికి రూ. 2.50 లక్షల వేతనం ఉంటుందని తెలిపారు. బయోడెటా, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, అకాడమిక్ ధృవపత్రాలు, సంబంధిత కళాశాల ఐడీ కార్డుతో నేరుగా ప్రాంగణ నియామకాలకు హాజరుకావాలని కోరారు.

పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ ఫీజు గడువు 12

కేయూ క్యాంపస్, జనవరి 29 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంటీఎం, ఎంహెచ్ఆర్ఎం, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఇతర పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల ఫీజును ఫిబ్రవరి 12 వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ సుంకరి జ్యోతిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 250 అపరాధ రుసుంతో ఫిబ్రవరి 15 వరకు గడువు ఉందని తెలిపారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని పేర్కొన్నారు.



ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

టీచర్‌గా మారిన అడిషనల్ కలెక్టర్

- పాఠ్యపుస్తకాల్లోని అంశాలపై ప్రశ్నలు

భీమదేవరపల్లి, జనవరి 29 : జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా టీచర్ అవతారం ఎత్తారు. సోమవారం ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలను అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధ శుక్లాలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐదో తరగతి విద్యార్థులను తెలుగు, గణితంలో వివిధ ప్రశ్నలు అడిగారు. అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు తడబాటుకు గురయ్యారు. దీంతో ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సూచనలు చేశారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత ఉద్యోగ లక్ష్యం దిశగా ఎంచుకొని అందుకు తగ్గట్టు చదువుకోవాలని సూచించారు. అలాగే పాఠశాలలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ముల్కనూర్ ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్న భవనానికి నిధులు రాలేదని కాంట్రాక్టర్లు సుదర్శన్‌రెడ్డి, లక్ష్మారెడ్డిలు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా బిల్లులు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. అనంతరం భీమదేవరపల్లిలోని గ్రంథాలయాన్ని పరిశీలించి, పోటీ పరీక్షలకు చదువుకునే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందులో ఏర్పాటు చేయాలని లైబ్రేరియన్ వాగు శివాజీకి సూచించారు. ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ కొంరయ్య, విద్యా కమిటీ చైర్మన్ పూర్ణచందర్, ముల్కనూర్ ఈవో పూర్ణచందర్ పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతికి సర్కార్ కృషి

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 29 : మైనారిటీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం తెలంగాణ స్టేట్ మైనారిటీ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సముచిత స్థానం దక్కుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఆరీఫ్‌అలీ, ప్రధాన కార్యదర్శి అఫ్జల్‌ఉద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు జహీర్ అహ్మద్, మసూద్ అబిద్, అసోసియేట్ ప్రెసిడెంట్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన జడ్జి



హాస్టల్‌ను తనిఖీ చేసి రికార్డులో సంతకం చేస్తున్న జడ్జి సరిత

తొర్రూరు, జనవరి 29 : డివిజన్ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల పోస్టుమెట్రిక్ హాస్టల్‌ను మండల లీగల్ సర్వీసు చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత సోమవారం సాయంత్రం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. హాస్టల్ వార్డెన్, నైట్ వాచ్‌మన్, ఇతర సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేసుకుని ఎలాంటి అనుమతులు లేకుండా గైర్హాజరు కావడంతో సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. తనిఖీ చేసినట్లుగా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. బాలికలకు అందిస్తున్న మెనూ పరిశీలించి తగు సూచనలు చేశారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు తనిఖీలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు.

స్టాఫ్‌నర్సు ఉద్యోగులకు ఐడీ కార్డులు అందజేత



స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఐడీ కార్డులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో

నెహ్రూసెంటర్, జనవరి 29 : తెలంగాణ ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఎంపికైన స్టాఫ్‌నర్స్ ఉద్యోగులకు డీఎంహెచ్‌వో అంబరీష సోమవారం ఐడీ కార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 95 మంది స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు ఎంపికయ్యారని, మెడికల్ కళాశాలకు 79 మంది, జిల్లా వైద్య విధాన పరిషత్‌కు 9 మందిని, ఎంజీపీటీపీసీడబ్ల్యూఆర్‌ఈఎస్-3, టీటీ డబ్ల్యూఆర్‌ఈఐఎస్-1, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్-3 వెరసి జిల్లా వ్యాప్తంగా 95 పోస్టులకు స్టాఫ్‌నర్సు ఉద్యోగాలకు సెలక్ట్ అయ్యారని పేర్కొన్నారు. ఎంపికైన ఉద్యోగులకు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఐడీ కార్డులను అందజేశారు. జనవరి 31న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా ఆర్డర్ కాపీలను అందజేస్తామని చెప్పారు. ఫిబ్రవరి 1 నుంచి ఉద్యోగులు విధుల్లో చేరుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రుక్మొద్దీన్, కేవీ.రాజు, వడ్డెబోయిన శ్రీను, రామకృష్ణ, నూతనంగా ఎంపికైన స్టాఫ్‌నర్సు ఉద్యోగులు పాల్గొన్నారు.

నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని చేపట్టాలి

జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పొ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పొ

మహబూబాబాద్ టౌన్, జనవరి 29: జిల్లాలో నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని అధికారులు సమన్వయంతో చేపట్టాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పొ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో డీవార్మింగ్ కార్యక్రమంపై సోమవారం డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. నులిపురుగల నివారణ దినోత్సవాన్ని అన్ని శాఖలు సమన్వయంతో చేపట్టాలని, ఫిబ్రవరి 12న డివార్మింగ్ మాత్రలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వైద్యాధికారి అంబరీష మాట్లాడుతూ... జాతీయ నులిపురుగల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 సంవత్సరాలు గల 1,77,534 మందికి అల్బెండజోల్ మాత్రలు అందిస్తామని చెప్పారు. 1 నుంచి 2 సంవత్సరాలకు సగం మాత్ర, 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఒక మాత్రను తప్పక వేయాలని సూచించారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 12న ప్రభుత్వ ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని ఆదేశించారు. మిగిలిన వారికి ఫిబ్రవరి 19న మాత్రలువేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో వైద్యులు విజయ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, సుధీర్, జిల్లా అధికారులు రమాదేవి, రామారావు, సత్యనారాయణ, వరలక్ష్మి, ప్రసన్నారాణి, కేవీ.రాజు, పురుషోత్తం పాల్గొన్నారు.

టీపీఎన్‌ఎం జిల్లా కమిటీ ఎన్నిక



నక్క సైదులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 29: సీపీఎం అనుబంధ తెలంగాణ ప్రజానాట్య మండలి(టీపీఎన్‌ఎం) జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో రెండు రోజుల పాటు జరిగిన సంఘం నాలుగవ జిల్లా మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కట్టి నర్సింహా, ఉపాధ్యక్షుడు వెల్పుల వెంకన్న సోమవారం తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా గార్ల మండలానికి చెందిన అలవాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కురవి మండలానికి చెందిన నక్క సైదులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బోర స్వామి, కొమ్ము శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా నూనె శ్రీనివాస్, జంగం ఉప్పలయ్య, గౌరవ అధ్యక్షుడిగా నక్క ఉప్పలయ్యను ఎన్నుకున్నారు.

తెలంగాణ ప్రగతిశీల జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా రవి



మహబూబాబాద్ రూరల్, జనవరి 29: తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాలోని తొర్రూరుకు చెందిన కొత్తపల్లి రవిని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఈ నెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర ప్రథమ మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. కొత్తపల్లి రవి గత 20 ఏళ్లుగా జిల్లా వ్యాప్తంగా ప్రజలను, గ్రామపంచాయతీ, మునిసిపల్, ఆటో, ట్రాక్టర్, భవన నిర్మాణ షాప్ వర్కర్స్‌తో పాటు అన్ని రంగాల కార్మికులను చైతన్యపరుస్తున్నారని చెప్పారు. 2016 నుంచి 2020 వరకు జిల్లా ఇఫ్టూ కమిటీ సభ్యుడిగా, 2020లో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పనిచేశారు. కాగా, తన ఎన్నికకు సహకరించిన అన్ని కార్మిక వర్గాల నేతలకు రవి కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టులు సామాజిక దృక్పథంతో పనిచేయాలి

మహబూబాబాద్‌టౌన్, జనవరి 29: జర్నలిస్టులు సామాజిక దృక్పథంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ (టీడబ్ల్యూజేఏ) 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజా అవసరాలను పరిగణలోకి తీసుకుని సమాజానికి ఉపయోగపడే కథనాలను రాయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి, డీపీఆర్వో శ్రీనివాస్, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు చిత్తనూరి శ్రీనివాస్, రవినాయక్, శ్రీనివాస్, రాంప్రసాద్, భూక్య మోహన్, చందులాల్, శ్రీను, మహేష్, యాకాంబ్రం పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పెద్దవంగర, జనవరి 29 : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 31న మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

కురవి, జనవరి 29: కార్మిక వర్గానికి బద్ధశత్రువుగా మారిన బీజేపీ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. కురవిలో సోమవారం జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూకేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. 12 గంటల పని దినాలను తీసుకువచ్చి కార్మికులను శ్రమ దోపిడికి గురిచేస్తుందన్నారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గుగులోతు సరోజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పోతుగంటి మల్లయ్య, గోనెల గోపయ్య, ఉపేంద్రాచారి, మల్లయ్య, లింగన్న, మహేష్, శారద, లచ్చయ్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 29: ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పొ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 73 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సవ్ టొప్పొ మాట్లాడుతూ... గ్రీవెన్స్‌కు వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. తక్షణమే దరఖాస్తులను పరిశీలించి గ్రీవెన్స్‌పై ప్రజలకు మరింత నమ్మకాన్ని పెంచాలని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమాదేవి, జిల్లా అధికారులు సన్యాసయ్య, వరలక్ష్మి, హరిప్రసాద్, ఖుర్షీద్, సూర్యనారాయణ, సుబ్బారావు, రామకృష్ణ, సుధాకర్, లక్ష్మీనారాయణ, మునిసిపల్ కమిషనర్ ప్రసన్నారాణి పాల్గొన్నారు.

అక్రమంగా కర్ర తరలిస్తున్న ట్రాకర్ సీజ్?

తొర్రూరు రూరల్, జనవరి 29: తొర్రూరు మండలం ఫత్తేపురంలో ఎలాంటి అనుమతులు లేకుండా కర్ర తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఫారెస్టు బీట్ ఆఫీసర్ రమేష్ తెలిపారు. ఫత్తేపురం గ్రామంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న నిర్వాహకుడు గ్రామం నుంచి కర్రను ట్రాక్టర్‌లో సోమవారం తీసుకువస్తుండగా పట్టుకున్నారు. ఈ మేరకు బీట్ ఆఫీసర్ రమేష్ మాట్లాడుతూ ట్రాక్టర్‌కు ఎలాంటి అనుమతులు లేకుండా పెద్ద సైజ్ కర్రను తరలిస్తున్నట్లు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ట్రాక్టర్‌ను సీజ్ చేస్తామన్నారు. కాగా, గ్రామంలోని ఓ రైతు ఇచ్చిన సమాచారం మేరకు పట్టుకున్న అధికారులు ఇటుక బట్టీ నిర్వాహకులతో కుమ్మకై ట్రాక్టర్‌ను తీసుకెళ్లినట్లు రైతు యాకూబ్‌రెడ్డి ఆరోపించారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ



ధర్మారంతండాలో ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కేసముద్రం, జనవరి 29: మహబూబాబాద్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కేసముద్రం మండలం అన్నారం, ధర్మారంతండా, తాళ్లపూసపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం 120 మంది విద్యార్థులకు భోజనం ప్లేట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మాధవపెద్ది వెంకట్‌రెడ్డి, అనుమాండ్ల వెంకటేశ్వర్లు, బి.శ్రీధర్, ఎండి.అబ్దుల్ సత్తార్, నాగనబోయిన వెంకటేశ్వర్లు, సూర్య ప్రకాశ్, పట్నాల సత్యనారాయణ, వెంకట్రావు పాల్గొన్నారు. అలాగే కేసముద్రం స్టేషన్ బ్రహ్మంగారితండా పాఠశాలలో కేసముద్రం లయన్స్‌క్లబ్ సభ్యుడు రుద్ర శ్రీకాంత్ సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్, హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వర్లు, పరాంకుశం శ్రీహరి, ఎస్‌ఎంసీ చైర్మన్ కోసల జవహర్‌లాల్, చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.చంద్రశేఖర్, బాలు, పద్మ పాల్గొన్నారు.

ఆంగ్లంపై భయాన్ని తొలగించేందుకు ఎల్టా కృషి



మహబూబాబాద్‌లో ఎల్టా మండల స్థాయి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సంఘం బాధ్యులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 29 : విద్యార్థులకు ఆంగ్లంపై భయాన్ని తొలగించేందుకు ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తడకమల్ల బ్రహ్మం, రామ్మోహన్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో సోమవారం ఎల్టా ఆధ్వర్యంలో మండల స్థాయిలో స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు నిర్వహించామని తెలిపారు. ఈ పోటీల ద్వారా విద్యార్థులకు ఆంగ్లంపై భయాన్ని తొలగించటమే కాకుండా ఆసక్తిని పెంపొందించేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన స్పెల్ విజార్డ్, డ్రామా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రతి విభాగం నుంచి ఇద్దరిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఫిబ్రవరి 2న నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఆయా మండలాల్లో నిర్వహించిన పోటీల్లో సంఘం మండల బాధ్యులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించాలి

గూడూరు : ఆంగ్ల భాష పట్ల విద్యార్థులు పట్టు సాధించాలని విద్యాశాఖ మండల నోడల్ అధికారి చీర భిక్షపతి అన్నారు. గూడూరు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పెల్ విజార్ పేరిట 8, 9 తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. దాంతో దారావత్ దేవేందర్ ప్రథమ బహుమతి గెలుచుకోగా, నాటికలో నవ్య, ఝాన్సీ, స్పందన, అనిల్, చరణ్ తేజ పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు వచ్చే నెల ఫిబ్రవరి 13న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంస్థ మండల కన్వీనర్ సాంబయ్య, కోకన్వీనర్లు అనిత్, శరత్‌బాబు, లక్షపతి, శ్రీనివాస్, శ్రీలత, సునీత పాల్గొన్నారు.

ఎల్టా ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్ పోటీలు

బయ్యారం : బయ్యారం హైస్కూల్‌లో సోమవారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా) ఆధ్వర్యంలో స్పెల్ విజార్డ్ అండ్ డ్రామా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి పి.దేవేంద్రాచారి, ఎల్టా మండల కన్వీనర్ గాడిపల్లి శ్రీను, కోకన్వీనర్ వి.వీరన్న పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

మాజీ జడ్పీటీసీ మూలగుండ్ల వెంకన్న



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

మహబూబాబాద్ టౌన్, జనవరి 29: గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారితో నష్టపోతున్న రైతులకు పరిహారం చెల్లించి న్యాయం చేయాలని మాజీ జడ్పీటీసీ మూలగుండ్ల వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్ ఎదుట సోమవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ మహారాష్ట్ర నుంచి తెలంగాణ మీదుగా అమరావతి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిలో వ్యవసాయ భూములు కోల్పోతున్న జిల్లా రైతాంగానికి ఎకరాకు రూ.12 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే రహదారితో కోల్పోతున్న పక్క జిల్లాల రైతులకు ఎకరాకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఇస్తున్నారని, అదే తరహాలో మానుకోట జిల్లాలోని రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో రోడ్డు పనులు నడవనివ్వబోమని చెప్పారు. భూములు కోల్పోయిన రైతుల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు మంజూరి చేయాలి

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్ చార్జీలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పట్ల మధు, డివిజన్ కార్యదర్శి సూర్యప్రకాశ్ అన్నారు. సదరు డిమాండ్‌లతో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సంవత్సర కాలంగా విద్యాశాఖకు సంబంధించి రూ.6,300 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే వాటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సవ్ టొప్పొకు వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గంధసిరి జ్యోతి, బానోత్ సింహాద్రి, రాజేష్, అభినవ్, దినేష్, రాజు, రామ్‌చరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల పట్ల వివక్ష చూపవద్దు

బయ్యారం, జనవరి 29 : బాలికల పట్ల వివక్ష లేకుండా సమానత్వంతో చూడాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ అన్నారు. బయ్యారం మండలం కొత్తపేట హైస్కూల్‌లో సోమవారం బేటీ బచావో, బేటీ పడావోపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పూనెం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించని వారిపై చర్యలు

మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి

మహబూబాబాద్ టౌన్, జనవరి 29 : పరిశుభ్రత పాటించని షాపులపై చర్యలు తప్పవని మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ దండె శ్రీహరి అన్నారు. కమిషనర్ ప్రసన్నారాణి ఆదేశాలతో మహబూబాబాద్ పట్టణంలోని పలు హోటళ్లు, క్యాంటిన్‌లలో సోమవారం తనిఖీలు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని ఓ హోటల్‌కు రూ.10వేలు, రెండు వైన్స్‌షాపు క్యాంటిన్‌లకు రూ.1000 చొప్పున రెండింటికి రూ.2 వేలు వెరసి మొత్తంగా రూ.12వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ... తినుబండారాల విషయంలో పరిశుభ్రత పాటించని షాపుయాజమానులపైచర్యలుతప్పవని హెచ్చరించారు.

అఫ్జల్‌ఖాన్ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

గార్ల, జనవరి 29 : మండలంలోని పాత పోచారంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పఠాన్ అఫ్జల్‌ఖాన్ మరణం పార్టీకి తీరని లోటని మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు అన్నారు. గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం రాత్రి మృతి చెందాడు. మండల పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు పఠాన్ అఫ్జల్‌ఖాన్ భౌతిక కాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మన్నేపల్లి సుగుణాదేవి, సర్పంచ్ బానోత్‌మోతీలాల్, నాయకులు మన్నేపల్లి వెంకయ్య, సైదయ్య, హనుమంతరావు, ప్రసాద్, సురేష్ నరేష్, శ్రీను, విఠల్ నాయక్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 29 : టెంట్‌హౌస్ కార్మికులకు ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని మహబూబాబాద్ పట్టణ టెంట్‌హౌస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల సారయ్య కోరారు. జిల్లా కేంద్రం శివారు అనంతాద్రిలో పట్టణ టెంట్‌హౌస్ అసోసియేషన్ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడారు. ఎమ్డీ.ఇక్బాల్, పిల్లి సుధాకర్, నర్సింగరావు, వెంకట్, కోటి, అనిల్, శ్రీకాంత్, సతీష్, సంతోష్, తులసిరాం పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందజేస్తాం

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



కల్యాణలక్ష్మి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, జనవరి 29 : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ పథకాలను నేరుగా అందజేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకివచ్చిన వెంటనే రెండు గ్యారంటీలను అమలు చేసిందని, త్వరలో మరో 4గ్యారంటీలను అమలు చేస్తుందని తెలిపారు. ఇప్పటి నుంచి జరిగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు రూ.1 లక్షతో పాటు తులం బంగారం అందిస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. తొర్రూరు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అభివృద్ధి పరుస్తామని, గత పాలకులు పట్టణ అభివృద్ధిని కాగితాలపై లెక్కలు చూపారని అన్నారు. వందల కోట్లతో అభివృద్ధి చేశామని చెప్పి ప్రజా ధనాన్ని దోచుకున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందని, ప్రజలు సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కార్యాలయానికి మొదటిసారి హాజరు కావడంతో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయ అధికారులు,సిబ్బంది శాలువా మెమెంటోలతో ఘనంగాసత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి, ఎంపీపీ అంజయ్య, వైస్ ఎంపీపీ శ్యాంసుందర్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వివిధ గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది, శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాన్‌ను ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన అర్జున్

మహబూబాబాద్ రూరల్, జనవరి 29 : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు ఏటిగడ్డతండా సమీపంలో ఓ ద్విచక్ర వాహనదారుడు ఆగివున్న వ్యాన్‌ను ఢీకొని మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జిల్లాలోని గంగారం మండలం మడగూడెం గ్రామానికి చెందిన ధనసరి అర్జున్ (23) సొంత పనుల నిమిత్తం మహబూబాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో మహబూబాబాద్ శివారు ఏటిగడ్డతండా వద్ద ఆగివున్న వ్యాన్‌ను వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో అర్జున్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించిన స్థానికులు 108 ద్వారా అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

అనుమానం వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు



అనిల్ (ఫైల్)

కురవి, జనవరి 29: కురవి మండల కేంద్రం శివారులో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తులిశ్యతండాకు చెందిన బానోత్ అనిల్(26) అనే యువకుడు మృతి చెందాడు. మహబూబాబాద్ కలెక్టరేట్ సమీపంలో వేసిన గుడిసెల్లో బానోత్ అనిల్ సైతం ఓ గుడిసె వేసుకున్నాడు. గత ఆరు నెలలుగా ప్రతి రోజు అక్కడికి వెళ్లి వస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. కురవి శివారులోని సూచిక బోర్డును బైక్‌తో వేగంగా ఢీకొట్టగా కుడి చేయి విరిగిపోయి రోడ్డుపై పడింది. ఈ ఘటనలో అనిల్ రెండు కాళ్లు సైతం విరిగిపోయాయి. అతన్ని తెల్లవారుజామున 4 గంటల సమయంలో స్థానికులు చూసి మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ.. సోమవారం మృతి చెందాడు. అతనికి తల్లి జమ్మి, సోదరులు నవీన్ ఉన్నారు. కాగా, తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఘటనపై పూర్తి విచారణ జరపాలని కురవి పోలీస్‌స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

మనస్తాపంతో బావిలో పడి మహిళ మృతి



పద్మ మృతదేహం

మహబూబాబాద్ రూరల్,జనవరి 29 : మహబూబాబాద్ మండలం మొట్లతండాలో ఓ మహిళ బావిలో పడి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మానుకోట రూరల్ ఎస్సై-2 కుమారస్వామి తెలిపిన ప్రకారం.. మొట్లతండాకు చెందిన బానోత్ పద్మ(50) తనకున్న మూడెకరాల భూమిలో మిర్చి, వరి సాగు చేశారు. ఇటీవల పద్మ కుమారుడు సుమన్ భార్య బానోత్ సరితకు పక్షవాతం రావడంతో బయట నుంచి సుమారు రూ.7లక్షల వరకు అప్పు తీసుకువచ్చి వైద్యం చేయించారు. చేసిన అప్పు ఎలా తీర్చాలని మనస్తాపానికి గురైన పద్మ ఆదివారం సాయంత్రం మిర్చి ఏరేందుకు కూలీలను పిలిచి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి పొద్దుపోయే వరకు పద్మ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికారు. ఎంతకీ పద్మ ఆచూకీ లభించలేదు. మరుసటి రోజు మధ్యాహ్నం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పద్మ విగతజీవిగా కన్పించింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పద్మ మృతదేహాన్ని బావిలో నుంచి తీసి మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందించారు. పద్మకు కుమారుడు సుమన్, కుమార్తె ఉన్నారు. కుమారుడు సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదలకు తాళ్లూరి చేసిన సేవలు మరువలేం

సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్

గార్ల, జనవరి 29 : మండలంలోని బుద్దారం గ్రామంలో పేద ప్రజల పక్షాన తాళ్లూరి నర్సయ్య చేసిన సేవలను ఈ ప్రాంత ప్రజలు నేటికి మరచిపోలేదని సీపీఎం మండల కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని బుద్దారం తండా క్రాస్ రోడ్డు సమీపంలోని తాళ్లూరి నర్సయ్య స్మారక స్థూపం వద్ద సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఎగురవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్దారం జీపీలో ప్రభుత్వ భూములను పేదలకు పంచే వరకు నర్సయ్య నాయకత్వంలో అనేక పోరాటాలు చేశారన్నారు. నర్సయ్య మన మధ్య లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాగం లోకేశ్వరరావు, నాయకులు ఈశ్వర్‌లింగం, వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు, గోవింద్, సింగం వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, నాగరాజు కొండయ్య, శాంతి తదితరులు పాల్గొన్నారు.